క్లుప్తంగా

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు



ఆత్మకూరు: పట్టణంలోని ఆర్యవైశ్యుల కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు గురువారం రాత్రి ఏకాంత సేవతో ముగిశాయి. చివరిరోజు సీతారాముల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏకాంత సేవలో భాగంగా వివిధ రాగాలతో మంగళవాయిద్యాలు వినిపించారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం



వింజమూరు(ఉదయగిరి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వింజమూరులోని బంగ్లా సెంటర్‌లో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. నాయకులు అంబేడ్కర్‌మాదిగ, ఆనందరావు, మంద సుజాత, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు విశేష పూజలు

ఉదయగిరి: గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పాముల రమణయ్య, రాజా, విజయ్, శ్రీనివాసులు,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

సీతారామపురం : స్థానిక ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఈ నెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ముజిబుర్ రెహమాన్ శుక్రవారం తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లో ఫొటో లేకపోతే అతికించి దానిపై పాఠశాల హెచ్‌ఎం సంతకం, సీలు వేయించుకుని విడిగా ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకుని పరీక్షకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 96403 58820 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మోటార్ కేబుల్ అపహరణ

సోమశిల: అనంతసాగరం మండలం మంచాలపల్లిలోని జగనన్న కాలనీలోని బోరు మోటారు కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. కాలనీలోని బోరు మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లేందుకు బయటకు లాగారు. గ్రామస్తులు గమనించడంతో మోటార్‌ను వదిలేసి కేబుల్‌వైర్‌ను తీసుకుని పరారయ్యారు. ఈ మేరకు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 13 వార్డుల్లో శనివారం తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని కమిషనర్ సీ గంగాప్రసాద్ శుక్రవారం తెలిపారు.వాటర్‌ప్లాంట్ క్లీనింగ్, మోటార్ల నిర్వహణ పనులు చేపడుతున్న దృష్ట్యా 4, 5, 6, 7, 8, 9, 10, 11, 13, 15, 16, 17, 18 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. ఆదివారం తిరిగి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

నేడు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర

ఆత్మకూరు: స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ-వ్యర్థాల నిల్వ గదిని శనివారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభించనున్నట్లు కమిషనర్ సీ గంగాప్రసాద్ శుక్రవారం తెలిపారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వరకు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలను శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది పొదుపు సభ్యులు, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

యూటీఎఫ్ వినతి

ఆత్మకూరురూరల్: విద్యా శాఖలో ప్రవేశపెట్టిన 117వ జీఓ రద్దు, పాఠశాల పునర్వ్యవస్థీకరణ, తదితర అంశాలపై యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆత్మకూరులోని ఏఎంసీ కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానాలు దీర్ఘకాలంలో విద్యారంగానికి ఓ చిక్కుగా పరిణమిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ నాయకులు శివప్రసాద్, ఖాదర్‌బాషా, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో మేట్ల చేతివాటం

దొంగ మస్టర్లతో బురిడీ

- బోగస్ హాజరుతో వేతనాలు స్వాహా
- అక్రమార్కులకు అధికారుల అండదండలు
- పనులపై కొరవడిన పర్యవేక్షణ



501,502 మస్టర్లలో ఒకే ఫొటో అప్‌లోడ్ చేసిన దృశ్యం



ఏడుగురు కూలీలు పనిచేస్తే పది మంది చేసినట్లుగా నమోదు చేసిన దృశ్యం

సీతారామపురం : గ్రామాల నుంచి వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం లక్ష్యం తప్పుతోంది. క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు చేపట్టకపోయినా అధికారులు, సిబ్బందికి మామూళ్లు అందితే చాలు అంతా బాగుందని ధ్రువీకరించి మమ అనిపిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు అసలే లేకపోవడంతో అధికార పార్టీ పేరు చెప్పి మేట్లు దండుకుంటున్నారు. బోగస్ మస్టర్లు వేసి నిధులు తమ ఖాతాలకు మళ్లించుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఉపాధిలో అవినీతిని అరికట్టేందుకు ఎన్ని విధానాలు ప్రవేశపెడుతున్న వీరి దోపిడీకి మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఆన్‌లైన్‌లోని లొసుగులను ఆసరాగా తీసుకుని దొంగ మస్టర్లు..బోగస్ హాజరుతో నిధులను స్వాహా చేస్తున్నారు. పని ప్రదేశం నుంచి కూలీల ఫొటోలను మస్టర్‌తో కలిపి ఎన్ ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా ఒకచోట నమోదు చేసిన ఫొటోలనే మరో మస్టర్‌కు నమోదు చేసి సొంత లాభం చూసుకుంటున్నారు. రోజుకు సగటున ప్రతి వ్యక్తికి రూ.307 కూలిగా నిర్ణయించారు. కూలీలు చేస్తున్న పనుల్లో కొలతలు వేస్తే అతి తక్కువగా కూలి పడుతోంది. ఇలాగైతే అధికారులు ఒప్పుకోకపోవడంతో కూలీలు పనిచేసిన..చేయకపోయినా అధిక కూలి వేయక తప్పడం లేదని పలువురు క్షేత్రస్థాయి సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఉపాధి హామీ పనుల అమలు తీరు ఇలాగే ఉంది. చాలా గ్రామాల్లో చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తున్నారు. వేసవికాలంలో గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా, ఎక్కువగా ప్రాధాన్యం లేని పనులు చేపడుతున్నారు. చాలా చోట్ల పంట కాలువల్లో కలుపు మొక్కలను తీస్తూ మమ అనిపిస్తున్నారు. పంట కాలువల నిర్మాణం, పూడికతీత, పొలం గట్లపై మొక్కలు పెంపకం, పంట కుంటలు, సరిహద్దు కందకాలు వంటి ప్రాధాన్యం ఉన్న పనుల జోలికి వెళ్లడం లేదు.

దొంగ మస్టర్లు..బోగస్ హాజరు

ఉపాధి హామీ సిబ్బంది మస్టర్లలో హాజరువేసిన కూలీల్లో 50 శాతం మంది మాత్రమే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. మరో 50 శాతం కూలీల పేరిట బోగస్ హాజరు వేస్తున్నారు. చాలా గ్రామాల్లో సగటున రోజుకు 30 మంది హాజరవుతుంటే మరో 20 మంది పేరిట బోగస్ హాజరు వేస్తున్నారు.. కూలీల ముఖచిత్రాలు తీయడం లేదు. పనులకు వెళ్లని వారి జాబ్ కార్డులు తీసుకుని వారికి హాజరు వేస్తున్నారు. ఖాతాల్లో జమయ్యే వేతనాన్ని మేటీలు, జాబ్ కార్డుదారులు సగం సగం పంచుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు, కిందిస్థాయి సిబ్బందికి తెలిసినా వారికి కూడా వాటాలు చెల్లిస్తున్నట్లు పలువురు మేట్లు స్వయంగా చెబుతున్నారు. కొందరు సీనియర్ మేట్లు ఒక్కొక్కరు ఐదు నుంచి పది గ్రూపుల వరకు బినామీ మేట్ల పేర్లతో నిర్వహిస్తున్నారు. వీరు సంబంధిత అధికారులు, సిబ్బందిని ప్రసన్నం చేసుకుని చేతివాటం చూపుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రూపులో పనికి రాకుండానే వేతనాలు పొందుతున్న వారు పదుల సంఖ్యలో ఉన్నారు. బిల్లులు చేయించుకునేందుకు ఉపాధి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ మొదలు టీఏ,ఈసీ ఏపీఓ, ఎంపీడీఓ స్థాయి వరకు మామూళ్లు ముట్టజెబుతున్నట్లు సమాచారం.

క్షేత్రస్థాయిలో ఇలా..

సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లి, బసినేనిపల్లి, గుండుపల్లి, జయపురం, నెమళ్లదిన్నె, పబ్బులేటిపల్లి, సీతారామపురం పంచాయతీల్లో శుక్రవారం చేపట్టిన 21 పనులకు గాను 121 మస్టర్ రోల్స్‌తో 693 మంది కూలీలు హాజరైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉన్నారు. వీటిని నిశితంగా పరిశీలిస్తే పలు సిత్రాలు దాగి ఉన్నాయి. మస్టర్ నంబర్లు 498,499,500లలో ఒకే వ్యక్తే అన్ని గ్రూపుల్లో కనపడుతున్నారు. 534వ మస్టర్ రోల్‌లో ముగ్గురు కూలీలు హాజరైతే ఇద్దరికి ఒకే జాబ్ కార్డు నంబర్ వేశారు. 501,502 మస్టర్ నంబర్లలో ఒకే ఫొటోను రెండుసార్లు అప్లోడ్ చేశారు. 498 మస్టర్‌లో ఏడుగురు కూలీలు ఉన్న ఫొటోను అప్లోడ్ చేసి 10 మందికి హాజరు వేశారు. 500వ మస్టర్ నంబర్‌లో 10 మంది ఫొటోలో ఉంటే 12 మందికి హాజరు వేశారు. 499వ మస్టర్‌లో కూడా అదే ఫొటోను అప్లోడ్ చేశారు. అంతేగాకుండా కూలీల చేతిలో పనిముట్లు ఉన్న ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉన్నా, అందుకుభిన్నంగా పనిముట్లు లేకుండానే ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయడం చర్చనీయాంశమైంది. ఒకే వ్యక్తి ఫొటోను రెండు, మూడు మస్టర్‌రోల్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ ఫొటో సిస్టంను మోసం చేస్తున్నారు. ఇలా మండలంలోని ప్రతి పంచాయతీ పరిధిలో ప్రతిరోజు దొంగ మస్టర్లు, ఒకరి స్థానంలో మరొకరి ఫొటోలు, కూలీల హాజరును ఎక్కువగా ఆన్‌లైన్ నమోదు చేస్తూ ఉపాధి నిధులను మింగేస్తూ జేబులు నింపుకొంటున్నారు.

బాధ్యులను వదిలేస్తున్నారు

క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఈసీలు, ఏపీఓలు పర్యవేక్షించాలి. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలి. సామాజిక తనిఖీల్లో అక్రమాలు బహిర్గతమై రికవరీకి ఆదేశిస్తే వెంటనే చర్యలు చేపట్టాలి. ఉపాధి హామీ నిబంధనల ప్రకారం రూ.10 వేలు రికవరీకి ఆదేశిస్తే ఫీల్డ్ అసిస్టెంట్, రూ.30 వేలు రికవరీకి టెక్నికల్ అసిస్టెంట్, రూ.50 వేలు రికవరీకి ఈసీలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా సామాజిక తనిఖీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా, రికవరీలకు ఆదేశిస్తున్నా బాధ్యులపై మాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు

చర్యలు తీసుకుంటాం



ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పనులకు వచ్చే కూలీలను మాత్రమే మస్టర్‌లో నమోదు చేసి వారి ఫొటోలనే అప్‌లోడ్ చేయాలి. ఎవరైనా బోగస్ మస్టర్లను నమోదు చేసినట్లుగా గుర్తిస్తే చర్యలకు వెనుకాడం.
–మృదుల, ఏపీడీ, ఉదయగిరి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్కే నాగూర్ శుక్రవారం తెలిపారు. జాతీయరహదారి నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్‌లైన్లు మారుస్తున్నందున బంగ్లాసెంటర్ నుంచి షఫి ఆస్పత్రి వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సోమశిల: సోమశిల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. 33 కేవీలైన్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్‌ను ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

21న మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ జీ వేణుగోపాల్‌రావు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ గువదగట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతారామపురం : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీల స్వయం ఉపాధికి సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం తెలిపారు. మండలానికి 15 యూనిట్ల రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. 21 నుంచి 50 ఏళ్లలోపు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మే 10వ తేదీలోగా ఓబీఎంఎస్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



సీతారామపురంలో శిలువ మోస్తున్న ఆర్సీఎం చర్చి విచారణ గురువు మంద సునీల్‌కుమార్

ఉదయగిరి: మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంతో పాటు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని అందజేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు.

సీతారామపురం: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని మండలంలో చర్చిల్లో క్రీస్తు ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల విచారణ గురువులు క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. సీతారామపురంలోని అరుంధతీయవాడలోని ఆర్సీఎం చర్చి విచారణ గురువు మంద సునీల్‌కుమార్ శిలువను మోసారు.

వరికుంటపాడు: మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో యేసుక్రీస్తు ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని విన్పించారు.

జలదంకి: మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జలదంకి, గట్టుపల్లి, బ్రాహ్మణక్రాక, జమ్మలపాళెం, తొమ్మిదోమైలు, తదితర గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఏసుక్రీస్తు మానవాళికి ఇచ్చిన సందేశాన్ని వివరించారు. ప్రతిఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమ, కరుణ చూపడంతో పాటు క్షమ, సహనం, త్యాగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఆత్మకూరు: పట్టణంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమ పాపాల కోసం శిలువపై ప్రాణాలు వదిలిన యేసుక్రీస్తును స్మరించుకుంటూ భక్తి గీతాలు ఆలపించారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని అందజేశారు. మధ్యాహ్నం సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో అన్నదానం చేశారు.



సోమశిలలో సందేశం ఇస్తున్న దైవసేవకులు

సోమశిల: అనంతసాగరం మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమశిలలోని క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో దైవసేవకులు నవీన్‌కుమార్ శిలువపై యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలను వివరించారు. సితారి పెంచలయ్య దంపతులు అన్నదానం చేశారు.



ఉదయగిరిలోని బర్లిట్ మెమోరియల్ చర్చిలో..

రక్తదానంతో ప్రాణదానం



శ్రీధర్ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు



సాయిశ్రీ ఆస్పత్రిలో ...

కావలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ కే సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలోని సాయిశ్రీ ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ కే సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. కావలిలోని రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌లోని తలసేమియా బాధిత చిన్నారులకు ఉచితంగా రక్తం, మందులు, పౌష్టిక ఆహారం అందజేస్తున్నారని తెలిపారు. వేసవి కారణంగా రక్తనిల్వలు తగ్గడంతో రక్తదాన శిబిరం నిర్వహణకు సాయిశ్రీ ఆస్పత్రి అధినేతలు డాక్టర్లు అల్లం శ్రీనివాసులు, పిట్టి పద్మశ్రీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ వేసవిలో రక్తనిల్వల కొరతను అధిగమించేందుకు ఒక ప్రణాళిక ప్రకారం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్లు అల్లం శ్రీనివాసులు, విజయభాస్కర్‌రెడ్డితో పాటు 40 మంది రక్తదానం చేశారు. సాయిశ్రీ ఆస్పత్రి పీఆర్వో బాషా, కొండబిట్రగుంటకు చెందిన మోటివేటర్ విజయ్ రక్తదాతలను సమీకరించారు.

శ్రీధర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో..

డాక్టర్లు పామూరు శ్రీధర్, పామూరు శివప్రసాద్ సోదరులు సమాజానికి అమూల్యమైన సేవలు అందిస్తున్నారని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీధర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ తల్లి పామూరు ఉమా ఐదో వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ శివప్రసాద్, పామూరు రాజా సోదరులు నిర్వహించిన ఈ శిబిరాన్ని డాక్టర్ రవికుమార్ ప్రారంభించి మాట్లాడారు. పామూరు విశ్వనాథం, ఉమ దంపతులు కష్టపడి వ్యవసాయం చేస్తూ తమ కుమారులు శ్రీధర్, శివప్రసాద్‌ను మెడిసిన్, రాజాను ఫార్మసీ చదివించారని తెలిపారు. తల్లితండ్రుల స్ఫూర్తితో డాక్టర్ శ్రీధర్ సోదరులు మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవడతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. డాక్టర్ శ్రీధర్ రెడ్‌క్రాస్ తలసేమియా ఆస్పత్రికి గౌరవ వైద్యాధికారిగా, పాలకమండలి సభ్యుడిగా సేవలు అందిస్తున్నారని వివరించారు. అనంతరం డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఝాన్సీ దంపతులతో పాటు 36 మంది రక్తదానం చేశారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి ఏ మధుసూదన్‌రావు, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎస్కే అబ్దుల్ నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



ఉదయగిరిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు



వెంగళరావునగర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఉదయగిరి: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉదయగిరిలో ముస్లింలు శుక్రవారం శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టం మైనార్టీల హక్కులకు ముప్పుగా పరిణమించే అవకాశం ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకోవాలనుకునే కేంద్ర ప్రభుత్వం కుట్రను తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వెంగళరావునగర్‌లో ముస్లింలు నల్లరిబ్బన్లు ధరించి శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ముస్లిం హక్కులను కాలరాసే వక్ఫ్‌సవరణ చట్టాన్ని కేంద్రం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు దస్తగిరి అహ్మద్, గాజుల తాజుద్దీన్, రియాజ్, షేక్ యస్దాని, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



గాయపడిన ప్రభాకర్

సంగం: మండలంలోని ర్యాంపు వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి ఆటోను బొలెరో ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. వంగల్లుకు చెందిన మస్తాన్ తన ఆటోలో పాల డెయిరీకి పాల క్యాన్లను తీసుకెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో ఖాళీ క్యాన్లను వేసేందుకు ఎస్వీఆర్ పురం గ్రామానికి వెళ్లేందుకు ర్యాంపు వద్ద కుడివైపునకు తిరుగుతుండగా వెనుకగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో వెనుక ఉన్న ప్రభాకర్ గాయపడ్డాడు. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం వద్ద ముంబయి జాతీయ రహదారిపై సీఐ జీ గంగాధర్, ఎస్సై ఎస్కే జిలానీ గురువారం అర్ధరాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. డ్రంక్‌అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం సేవించి ద్విచక్రవాహనాలను నడుపుతున్న ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మోటారు సైకిళ్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చోరీ కేసులో విచారణ ముమ్మరం

కావలి: పట్టణంలో గురువారం నాలుగు ఇళ్లల్లో జరిగిన చోరీల కేసులో విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. చోరీకి పాల్పడిన ముఠాలోని ఒక నిందితుడిని కావలి రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రెండో పట్టణ సీఐ గిరిబాబు నిందితుడి ద్వారా దొంగల ముఠాలోని మిగిలిన ముగ్గురి వివరాలను సేకరిస్తున్నారు. గత రెండేళ్ల కాలంలో కావలిలో సుమారు 30కు పైగా చోరీలు జరిగాయి. ఈ చోరీల్లో సుమారు రూ.2.50 కోట్ల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఇప్పటి వరకు ఒక్క చోరీ కేసులో కూడా పోలీసులు దొంగలను పట్టుకోలేదు. తాజాగా జరిగిన చోరీల ఘటనలో దొరికిన నిందితుడి ద్వారా గతంలో జరిగిన వాటికి సంబంధించిన సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు.

అస్తవ్యస్తంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని శంఖవరంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామంలో 20 వరకు త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, వాటి పరిధిలో 50కుపైగా వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. గత 14 రోజులు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక మోటార్లు ఆడడం లేదని రైతులు తెలిపారు. ఈ కారణంగా పంటలు ఎండిపోవడమే కాకుండా పశువులకు కూడా నీరందని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ ఎస్‌కే నాగూర్‌వలీని సంప్రదించగా సమస్య ఉన్న మాట వాస్తవమేనని, శనివారం సాయంత్రంలోగా సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ఉదయగిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



వింజమూరులో ..

ఉదయగిరి/ ఆత్మకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఉదయగిరిలోని పెట్రోల్ బంక్‌ల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్‌ఆఫీసర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెట్రోల్ బంక్‌ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పివేయాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. అలాగే వింజమూరులోని పలు పెట్రోల్‌బంక్‌ల వద్ద అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక అగ్నిమాప కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఆత్మకూరులోని పెట్రోల్ బంకుల వద్ద అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది నరసయ్య, సుధాకర్‌రావు, ప్రభాకర్, ఇమ్మానుయేల్, రామచంద్ర, రబ్బానీ, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..